సాక్షి
జోగుళాంబ గద్వాల
బుధవారం, 4, సెప్టెంబర్, 2024



ఏసీబీకి చిక్కిన ఏసీటీఓ

జీఎస్టీ లైసెన్స్ మంజూరు కోసం లంచం తీసుకుంటూ ఏసీటీఓ ఏసీబీకి పట్టుబడ్డాడు.

వివరాలు 8లో ▸



జూరాలకు తగ్గిన వరద

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.0 /21.5

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి డీఈఓగా రవీందర్

గద్వాల: జిల్లా విద్యాశాఖ అధికారిగా రవీందర్ నియమితులయ్యారు. మహబూబ్‌నగర్ రెగ్యులర్ డీఈఓగా పనిచేస్తున్న ఆయనకు జోగుళాంబ గద్వాల జిల్లా ఎఫ్ఏసీ డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం **డీఈఓగా రవీందర్** బాధ్యతలు స్వీకరించనున్నారు. **జిల్లాలో** గతేడాది నుంచి రెగ్యులర్ **డీఈఓ పోస్టు** ఖాళీగా ఉంది. అప్పటి **నుంచి ఇన్‌చార్జి డీఈఓ**తోనే నెట్టుకొస్తున్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ. 5,552

గద్వాల వ్యవసాయం: **జిల్లా కేంద్రంలోని** వ్యవసాయ మార్కెట్**లో మంగళవారం వేరుశ**నగ క్వింటాల్ గరిష్ఠం**గా రూ. 5,552, కనిష్ఠం**గా రూ. 1,906, సరాసరి **రూ. 3,289 ధరలు** పలికాయి. మొత్తం **556 క్వింటాళ్ల వేరుశనగ** అమ్మకానికి వచ్చింది.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

గద్వాల రూరల్: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో డీపీఓ శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులకు 8 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధు, వెంకటరామిరెడ్డి, చంద్రాములు, కురుమన్న, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



మానవపాడు: ఎవరైనా మహిళలు, విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీటీం బృందం దివ్యరాణి, లోకేశ్వరి సూచించారు. మండలంలోని జల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థినులను ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసినా, అసభ్యంగా ప్రవర్తించినా 87126 70312 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలకు పాల్పడితే డయల్ 1098 లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం విష్ణువర్ధన్, ఇన్‌చార్జి హెచ్ఎం రజిత తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్కాలర్‌షిప్ కోసం ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి ఛత్రునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా సంబంధిత విద్యాసంస్థలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఒకరోజు వేతనం విరాళం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్రంలో భారీవర్షాల వల్ల నిరాశ్రయులైన బాధితులను ఆదుకోవడానికి తమవంతుగా ఒకరోజు వేతనాన్ని విరాళంగా ముఖ్యమంత్రి సహాయనిధికి ఇస్తున్నట్లు టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎస్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ ఆదేశాల మేరకు విరాళం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించి ఒకరోజు వేతనాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.

డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ఇద్దరు నయాబ్ తహసీల్దార్లకు పదోన్నతులు లభించాయి. ఈ మేరకు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. నయాబ్ తహసీల్దార్లుగా ఉన్న శోభ, భరత్‌కుమార్‌లకు తహసీల్దార్లుగా పదోన్నతి ఇచ్చి.. నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటాయించారు.



అలంపూర్ మండలంలో మత్తడి పోస్తున్న భీమవరం చెరువు

జల 'కళ'..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

- ఈ సీజన్‌లో ఇప్పటి వరకు నగటుకు రెట్టింపు స్థాయిలో వర్షపాతం నమోదు
- నిండిన జూరాల, కోయిల్‌సాగర్ తదితర ప్రాజెక్టులు
- అలుగు పారుతున్న 3,097 చెరువులు, కుంటలు
- ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకాలు



కేటీదొడ్డి మండలంలో అలుగు పారుతున్న వెంకటాపురం చెరువు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

ఈ సీజన్‌లో ఇప్పటివరకు వర్షం దంచికొట్టింది. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లోనూ సగటుకు మించి వర్షపాతం నమోదైంది. వరద పోటెత్తడంతో అన్ని ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, ఇతరత్రా జలాశయాలు పూర్తి స్థాయిలో నిండి మత్తడి దుంకుతున్నాయి. అదేవిధంగా ఉమ్మడి జిల్లాకు వరప్రదాయిని అయిన ఇందిర ప్రియదర్శిని జూరాల, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు ప్రాజెక్టులతో పాటు సంగంబండ, సరళాసాగర్, రామన్‌పాడు తదితర రిజర్వాయర్లలో జలకళ ఉట్టిపడుతోంది. దీంతో వాటి పరిధిలోని ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సగటుకు రెట్టింపు స్థాయిలో వర్షం..

మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 357.50 మిల్లీమీటర్లు కాగా.. 590 మి.మీ.లు కురిసింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో 322.10 మి.మీ.లకు 606.10 మి.మీ.లు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 339.80 మి.మీ.లకు 660.6 మి.మీ.లు, వనపర్తి జిల్లాలో 363.60 మి.మీ.లకు 775.30 మి.మీ.లు, నారాయణపేట జిల్లాలో 361.08 మి.మీలకు 762 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. ఈ లెక్కన అన్ని జిల్లాల్లోనూ సాధారణానికి మించి వర్షం కురవగా.. చెరువులు, కుంటల్లోకి వరద నీరు భారీగా చేరింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 6,130 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో 76 నుంచి వంద శాతం నిండినవి 2,464 కాగా.. మరో 3,097 చెరువులు, కుంటలు అలుగు పోస్తున్నాయి. ఈ క్రమంలో సుమారు 10 లక్షల ఎకరాలకు రెండు సీజన్లలో సాగు నీటికి ఢోకా లేదని అంచనా.

బిరబిరా కృష్ణమ్మ..

భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరదతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జలప్రదాయినిగా పేరొందిన జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.03 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం మంగళవారం 2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఈ క్రమంలో 27 గేట్లు ఎత్తి 2,09,000 **క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి** విడుదల **చేశారు. ఈ ప్రాజెక్ట్** పరిధిలో ఆయకట్టు **1,09,700 ఎకరాలు కాగా..** రెండు సీజన్లకు **సాగుకు ఢోకా లేదని** రైతులు హర్షం వ్యక్తం **చేస్తున్నారు.**

■ **మహబూబ్‌నగర్ జిల్లా**లో 2.27 టీఎంసీల **నీటి నిల్వ సామర్థ్యమున్న** కోయిల్‌సాగర్ ప్రాజె**క్ట్‌లో ప్రస్తుత నీటి మట్టం** 2.25 టీఎంసీలకు **చేరింది. ప్రస్తుతం నాలుగు** గేట్లు ఒక అడుగు **మేర పైకెత్తి 3 వేల క్యూసెక్కుల** నీటిని కిందికి **వదిలారు. ఈ ప్రాజెక్ట్ కింద** ఆయకట్టు 50,250 **ఎకరాలు కాగా.. అన్నదాత**ల్లో సంతోషం వెల్లివి**రుస్తోంది.**

నీటి కష్టాలు తీరాయి..



రెండేళ్లుగా వర్షాలు సరిగా లేక సాగుచేసుకున్న పంటలకు నీరుపారక ఇబ్బందులు పడ్డాం. ఈసారి వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. మా ఊరి చెరువు అలుగు పారడంతో భూగర్భజలాలు పెరిగాయి. నాకున్న ఐదు ఎకరాల్లో వరి, పత్తి పంటలు సాగుచేశాను. గతేడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో మూడెకరాలలో మాత్రమే పంట వేశాను. ఈసారి వానదేవుడు దయ చూపాడు.

– తాయప్ప, గువ్వలదిన్నె, కేటీదొడ్డి మండలం

భూగర్భజలాలు పెరిగాయి..



ఈసారి వర్షాలు ఆశించిన స్థాయిలో కురిశాయి. సల్కాపురం చెరువు నిండటంతో భూగర్భజలాలు పెరిగాయి. మొత్తం 4 ఎకరాలు ఉండగా.. రెండెకరాల్లో వరి, రెండెకరాల్లో పత్తి పంటలు వేశాను. బోరుబావి నుంచి సమృద్ధిగా నీరు వస్తున్నాయి.

– సుంకన్న, సల్కాపురం, గట్టు మండలం

చెరువులు, కుంటలకు జలకళ ఇలా..

జిల్లా	మొత్తం	నిండినవి				అలుగు పోస్తున్నవి
		0-25%	26-50 %	51-75 %	76-100 %	
మహబూబ్‌నగర్	1,348	06	18	56	348	920
వనపర్తి	1,255	34	56	174	282	709
నారాయణపేట	764	-	16	107	237	404
జోగుళాంబ గద్వాల	563	-	04	18	97	444
నాగర్‌కర్నూల్	2,200	-	-	80	1,500	620

ప్రాజెక్టులు ఇలా..

ప్రాజెక్టులు	జూరాల	కోయిల్‌సాగర్
నిల్వ సామర్థ్యం	9.657 టీఎంసీలు	2.27 టీఎంసీలు
ప్రస్తుత నిల్వ	8.03 టీఎంసీలు	2.25 టీఎంసీలు
ఆయకట్టు (ఎకరాల్లో)	1,09,700	50,250

ముంపు ముప్పే



గతంలో కురిసిన వర్షానికి జలమయమైన కుంటవీధి (ఫైల్)

జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంత ప్రజల అవస్థలు

- శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించని అధికార యంత్రాంగం
- హడావుడి చర్యలతోనే సరిపెడుతున్న వైనం

గద్వాలటౌన్: జిల్లా కేంద్రమైన గద్వాల దినదినాభివృద్ధి చెందుతోంది. అందుకు అనుగుణంగా ప్రజలకు సౌకర్యాల కల్పనలో అధికార యంత్రాంగం ఉదాసీన వైఖరి అవలంభిస్తోంది. ముఖ్యంగా వర్షాలతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా చేపట్టాల్సిన పనులపై అతీగతీ లేకుండా పోయింది. ఫలితంగా ప్రతి ఏటా వర్షాకాలంలో ప్రధాన ప్రాంతాలతో పాటు లోతట్టు కాలనీల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణీకరణకు తగ్గట్టుగా వరద నీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో ముంపు సమస్య తలెత్తుతోందని నిపుణులు చెబుతున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

■ వర్షం కురిస్తే చాలు 34వ వార్డులోని కుంటవీధి ప్రజల్లో ఒక రకమైన వణుకు మొదలవుతుంది. చిన్నపాటి వర్షానికే వరద నీరు ఇళ్లను చుట్టుముడుతుంది. మోస్తరు వర్షం అయితే మురుగు నీటితో ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంటుంది. ఇళ్లలోకి చేరే వర్షం నీటితో రాత్రంతా జాగారం చేసే పరిస్థితి ఉంది. ఏళ్ల నాటి మురుగు కాల్వల కారణంగా సమస్య నెలకొంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టక పోవడంతో తిరిగి ముంపు ముప్పు వాటిల్లే అవకాశాలు ఉన్నాయి.

■ 21వ వార్డు పరిధిలోని నల్లకుంట కాలనీలో మోస్తరు వర్షానికే వరద ఇళ్లలోకి చేరుతుంది. ఎగువ ప్రాంతంలో కురిసే వర్షపు నీరంతా నల్లకుంట కాలనీలోకి చేరుతుంది. వరద నీటిని తట్టుకునే సామర్థ్యం ప్రస్తుతమున్న డ్రెయినేజీ వ్యవస్థకు లేదు. కాలనీ పై భాగంలో ఉన్న మేజర్ డ్రెయినేజీలో పూడికతీత నామమాత్రంగా ఉండటం.. కాలనీలో ఏళ్లనాటి డ్రెయినేజీల కారణంగా సమస్య నెలకొంది. వర్షం తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తారు.

చిన్నపాటి వర్షాలకే..

జిల్లా కేంద్రంలో చిన్నపాటి వర్షాలకే డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థతో లోతట్టు ప్రాంతంలోని నల్లకుంట, కుంటవీధి కాలనీల ప్రజలు ప్రతి ఏడాది వర్షాల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. వీటితో పాటు సుంకులమ్మ మెట్టు, జివిలీవీధి, పాత హౌసింగ్‌బోర్డు కాలనీలోని దిగువ ప్రాంతం, చిన్న అగ్రహారం తదితర కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. లోతట్టు కాలనీలతో పాటు ప్రధాన చౌరస్తాలలోని రథశాల, కూరగాయ మార్కెట్, రాజీవ్‌మార్గ్ రోడ్డు ప్రాంతాలు మడుగులను తలపిస్తాయి.

శాశ్వత పరిష్కారం చూపాలి..



అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించాలి. తద్వారా వానాకాలంలో ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపై స్పష్టత వస్తుంది. మాస్టర్ ప్లాన్ మేరకు శాశ్వత పనులు చేపడితే సత్ఫలితాలు వస్తాయి. గతంలో ముంపు ప్రాంతాలపై నిపుణులతో రూపొందించిన నివేదికను కలెక్టర్‌కు అందించడం జరిగింది. ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– మోహన్‌రావు, సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు, గద్వాల

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి..



జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గతంలో ఎదురైన సమస్యల ఆధారంగా ఈ సారి చర్యలు చేపడుతున్నాం. అందులో భాగంగా సమస్యాత్మక ప్రాంతాలలో ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను చక్కదిద్దడం జరిగింది. లోతట్టు ప్రాంతాలలో ఉన్న డ్రెయినేజీలను విస్తరించాం. మేజర్ డ్రెయినేజీలలో ఇప్పటికే పూడికతీత పనులు చేపట్టాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తాం.

– బీఎస్ కేశవ్, మున్సిపల్ చైర్మన్, గద్వాల



ముంపునకు గురైన నల్లకుంట కాలనీ (ఫైల్)

ఎస్‌ఎస్‌సీలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్, పక్కన అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

గద్వాల: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో కేజీబీవీల ప్రత్యేకాధికారులు, ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను అన్నివిధాలా సన్నద్ధం చేయాలన్నారు. గతేడాది పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం అట్టడుగు నుంచి రెండవ స్థానంలోకి వచ్చిందని.. ఈసారి పరిస్థితి మారాలన్నారు. ప్రతి విద్యార్థి విధిగా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. విద్యార్థులకు యూనిఫాం, క్రమశిక్షణ వంటివి ప్రధానంగా నేర్పించాలన్నారు. వివిధ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో త్వరలోనే విద్యావలంటీర్లను నియమిస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పీ సీఈఓ కాంతమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు, బీసీ వెల్ఫేర్ అధికారి సరోజ, ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక, హెచ్ఎంలు తదితరులు ఉన్నారు.

మోటార్ల బిగింపు బాధ్యత నిర్మాణ సంస్థదే..

- ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడదు
- వట్టెం పంప్‌హౌస్‌ను పరిశీలించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి



వట్టెం పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ కింద చేపట్టిన వట్టెం పంప్‌హౌస్‌లో నీట మునిగిన మోటార్లను పూర్వస్థితికి తెచ్చే బాధ్యత నిర్మాణ సంస్థదేనని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను కాంట్రాక్ట్ సంస్థ ఇంకా ప్రభుత్వానికి అప్పగించలేదని, పంప్‌హౌస్‌లోని నీటిని బయటకు తోడటంతో పాటు పూర్తి స్థాయిలో మోటార్ల ఏర్పాటు బాధ్యత కాంట్రాక్టు సంస్థకు ఉందని చెప్పారు. దీంతో ప్రభుత్వానికి అదనంగా ఎలాంటి ఆర్థిక భారం ఉండదని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం పంప్‌హౌస్‌లో నీటమునిగిన పంప్‌హౌస్‌ను మంగళవారం పరిశీలించారు. ఒకే రోజున 14 సెంమీ. వర్షం కురవడంతో సమీపంలో చెరువులు ఉప్పొంగి పంప్‌హౌస్‌లోకి నీరు చేరిందని చెప్పారు. ప్రాజెక్ట్ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, ఈఈ పార్థసారథి, డీఈలు సత్యనారాయణగౌడ్, బాగయ్య తదితరులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. భవిష్యత్తులోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.

కేంద్ర పథకాలు ప్రతి ఇంటికీ చేర్చాలి



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

గద్వాలటౌన్: పేదల సంక్షేమానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఇంటికీ చేరాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని భీంనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన పీఎం విశ్వకర్మ యోజన టైలరింగ్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు రామాంజనేయులు, బండల వెంకట్రాములు, శివారెడ్డి, కౌన్సిలర్ జయశ్రీ, డబ్బిలేటి నర్సింహ, దేవదాసు, చిత్తారి కిరణ్, మీడియా ఇన్‌చార్జి కేశవ్ పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

మానవపాడు: విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్, ఇన్‌చార్జి డీఆర్డీఓ నర్సింగరావు అన్నారు. మానవపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వర్షానికి దెబ్బతిన్న గదులను మంగళవారం పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అమరవాయి యూపీఎస్, అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. వర్షం కురిసినప్పుడల్లా కేజీబీవీలో అవస్థలు పడుతున్నామని విద్యార్థినులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన కూరగాయలు, సరుకులతో విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, ఎస్ఓ అనురాధ, ఇన్‌చార్జి హెచ్ఎం రామ్మూర్తి పాల్గొన్నారు.

ఫలించిన ఇరిగేషన్ అధికారుల కృషి

- చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి నీరు బయటకు



చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి బయటకు వెళ్తున్న నీరు

గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి నీరు బయటకు వెళ్లడం ప్రారంభమైంది. రిజర్వాయర్ నీటిని బయటకు పంపేందుకు వారం రోజులుగా ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు సమాంతర కాల్వను తవ్వించారు. రిజర్వాయర్ కట్ట వద్ద అడ్డుగా ఉన్న బండరాళ్లను మంగళవారం బ్లాస్టింగ్ చేసి, నీరు బయటికి వెళ్లే విధంగా చేశారు. దీంతో చిన్నోనిపల్లె గ్రామస్తులకు ముంపు ముప్పు తప్పినట్లయ్యింది. రిజర్వాయర్ కట్టను పూర్తిగా నిర్మించడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. చిన్నోనిపల్లె గ్రామస్తులు వ్యవసాయ పొలాలు, పునరావాస కేంద్రానికి వెళ్లే దారి నీటమునిగింది. దేవాలయానికి 100 మీటర్ల దూరంలోకి రిజర్వాయర్ బ్యాక్ వాటర్ చేరడంతో నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గట్టు తహసీల్దార్ సరితారాణి, ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, ఏఈ ఉపేందర్, కాంట్రాక్టర్ సునీల్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ ఉమాదేవేందర్ సమాంతర కాల్వ ద్వారా రిజర్వాయర్‌లోని నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు రిజర్వాయర్ నీరు బయటకు వెళ్తుండటంతో చిన్నోనిపల్లె గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


రవి (ఫైల్)

మాగనూర్ (కృష్ణా): కృష్ణా మండలం కున్సి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన రవి (26) పని నిమిత్తం బైక్‌పై టైరోడ్డుకు వెళ్లి తిరిగి వస్తుండగా హిందూపూర్ సమీపంలో ఉన్న బసవేశ్వర కల్యాణ మండపం దగ్గర యాద్గిర్ నుంచి రాయచూర్ వెళ్తున్న కర్ణాటక డిపో బస్సు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుడెబల్లూరులో వాహనం ఢీకొని..

మాగనూర్ (కృష్ణా): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ కతలప్ప కథనం మేరకు.. కృష్ణా మండలం గుడెబల్లూర్‌కు చెందిన మారెప్ప(36)ను గ్రామ సమీపంలోని క్రషర్‌గడ్డ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసునమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్, కారు ఢీకొని మరొకరు..


వెంకటయ్య (ఫైల్)

చారకొండ: బైక్, కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కదారి వెంకటయ్య (45) శ్రీశైలం క్రాస్‌రోడ్ వద్ద ఉన్న పెట్రోల్‌బంక్‌లో డీజిల్ తీసుకొని బైక్‌పై గ్రామానికి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో దేవరకొండ-కల్వకుర్తి ప్రధాన రహదారిపై అతివేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటయ్యకు భార్య శిరీష, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని.. దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు..

కొల్లాపూర్: పట్టణ సమీపంలోని ఓ వ్యవసాయ పొలంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. మండలంలోని సున్నపుతండాకు చెందిన సీతారాంనాయక్ (55) కొల్లాపూర్ ఖాదర్‌పాషా దర్గా సమీపంలో వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాడు. వేరొకరికి చెందిన బావి వద్ద మోటారు ఏర్పాటు చేసుకొని పంటకు నీరందిస్తున్నారు. మంగళవారం సాయంత్రం మోటారు వద్ద విద్యుత్ సరఫరాను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సీతారాంనాయక్‌కు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని సున్నపుతండాకు తరలించారు. బాధిత కుటుంబాన్ని ఎంపీటీసీ మాజీ సభ్యుడు శంకర్‌నాయక్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు.

'పాలమూరు' ప్రాజెక్టు పనుల్లో కార్మికుడి మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు గ్రామ సమీపంలో కొనసాగుతున్న పాలమూరు ప్రాజెక్టు మొదటి లిఫ్టు పనుల్లో ఓ కార్మికుడు మృతిచెందాడు. ప్రాజెక్టులోని టన్నెల్‌లో 9వ డెలివరీ పంపు వద్ద టన్నెల్‌లో సోమవారం రాత్రి కాంక్రీట్ పనులు ముగించుకొని బయటకు వస్తున్న క్రమంలో బిస్వనాథ్ కిస్కు(40) డెలివరీ పంపు హోల్ ముందుకు వెళ్లాడు. దీంతో పంపులో నుంచి వచ్చిన బలమైన గాలికి బిస్వనాథ్ ఎగిరి కిందపడగా ఇనుప చువ్వలు గుచ్చుకోవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. బిస్వనాథ్‌ది పశ్చిమబెంగాల్‌లోని జల్‌పైగురి జిల్లా మైరాదుర్గ్ స్వగ్రామం. ఈ ప్రమాద ఘటనపై బిస్వనాథ్ తోటి కార్మికుడు బరర్ తాక్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హృషికేష్ తెలిపారు. మంగళవారం బిస్వనాథ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అతని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడు..


రాంచందర్(ఫైల్)

ఊట్కూరు: స్థానిక ఎల్‌బీనగర్ వీధికి చెందిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు వివరాలు ఇలా ఉన్నాయి. రోశనప్ప కుమారుడు రాంచందర్(23) వారం రోజుల కిందట నారాయణపేటకు వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా.. ఊట్కూరు శివారులో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఏసీబీకి చిక్కిన ఏసీటీఓ

జీఎస్టీ లైసెన్స్ కోసం రూ.10 వేల లంచం డిమాండ్

- బాధితుడి నుంచి డబ్బు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన వైనం
- ఏసీటీఓ స్వస్థలం గద్వాలలోని ఇంట్లో తనిఖీలు చేసిన నల్లగొండ బృందం

మహబూబ్‌నగర్ క్రైం: ఏసీబీకి మరో అవినీతి చేప చిక్కింది. జీఎస్టీ లైసెన్స్ మంజూరు చేయడం కోసం ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ జిల్లా వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ అధికారి, అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ డి.వెంకటేశ్వర్‌రెడ్డి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ కథనం ప్రకారం.. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఒంటిగుంట తండాకు చెందిన సంతోష్‌నాయక్‌కు మహబూబ్‌నగర్‌లోని మర్లులో వీడీఎన్ ట్రేడర్స్ పేరుతో విత్తనాల దుకాణం ఏర్పాటు చేయడానికి జీఎస్టీ లైసెన్స్ కోసం జిల్లా వాణిజ్య పన్నుశాఖ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆగస్టు 22న ఏసీటీఓ వెంకటేశ్వర్‌రెడ్డి మర్లులో ఉన్న వీడీఎన్ దుకాణాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయలేదని చెప్పారు. రూ.50వేలు ఇస్తే దుకాణానికి జీఎస్టీ లైసెన్స్ మంజూరు చేస్తానన్నాడు. దీంతో రెండు రోజుల తర్వాత కార్యాలయానికి వెళ్లిన బాధితుడు అంత డబ్బు ఇచ్చుకోలేదని చెప్పి.. చివరికి రూ.10 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. అనంతరం సంతోష్‌నాయక్ ఏసీబీ అధికారులను సంప్రదించారు. ముందస్తు ప్లాన్ ప్రకారం మంగళవారం ఉదయం 11 గంటలకు సంతోష్ రూ.10వేల నగదును మహబూబ్‌నగర్ న్యూటౌన్‌లో ఉన్న జిల్లా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఏసీటీఓ డి.వెంకటేశ్వర్‌రెడ్డికి ఇస్తుండగా.. డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.


ఏసీటీఓ డి.వెంకటేశ్వర్‌రెడ్డి

గద్వాలలో సోదాలు

గద్వాల: లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏసీటీఓ వెంకటేశ్వర్‌రెడ్డికి చెందిన గద్వాలలోని ఆయన నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు సీఐస్థాయి అధికారులు మరో ముగ్గురు సిబ్బందితో కలిసి ఉదయం నుంచి రాత్రి వరకు ఇంట్లో సోదాలు చేపట్టారు. ఇందులో విలువైన స్థిరాస్తి డాక్యుమెంట్లు లభ్యం కాగా.. వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వెంకటేశ్వర్‌రెడ్డి స్వగ్రామం గద్వాల మండలం శెట్టిఆత్మకూరు పరిధిలో కూడా విలువైన స్థిరాస్తి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటన్నింటికి సంబంధించి అవసరమైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుని, ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్‌కు సమర్పించినట్లు పేర్కొన్నారు.


ఏసీటీఓ వెంకటేశ్వర్‌రెడ్డి ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు ఏసీబీ అధికారులను సైతం నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ, ఏఎస్పీ శ్రీకృష్ణగౌడ్ వెల్లడించారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన ఏసీటీఓ వెంకటేశ్వర్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 12 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. రాబోయే రోజులలో మరిన్ని దాడులు చేస్తామని, బాధితులను ఏ అధికారి డబ్బులు అడిగినా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

12 కేసులు.. రెండు ఆకస్మిక తనిఖీలు

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో అవినీతి చేపలు భారీగా పట్టుబడటం ప్రభుత్వ శాఖలలో కలకలం రేపుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం అవినీతి కేసులు జిల్లాలో ఎక్కువ నమోదయ్యాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 12 కేసులు నమోదు కాగా 20 మందిని కోర్టులో హాజరుపరిచారు. అలాగే ఆర్టీఏ కార్యాలయాలు, బీసీ వెల్ఫేర్ కార్యాలయాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇక రాష్ట్రంలో ఉమ్మడి పాలమూరు అవినీతి కేసుల్లో టాప్ వన్‌లో ఉండటం విశేషం.

జూరాలకు తగ్గిన వరద


జూరాల జలాశయం నుంచి దిగువకు పారుతున్న వరద

27 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ధరూరు: మహారాష్ట్ర, కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలతో 10 రోజులుగా ప్రియదర్శిని జూరాల జలాశయానికి వస్తున్న వరద మంగళవారం తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో 3.20 లక్షల క్యూసెక్కులు ఉండగా.. మంగళవారం సాయంత్రానికి 2 లక్షలకు తగినట్లు వివరించారు. దీంతో ప్రాజెక్టు 27 క్రస్ట్ గేట్లు ఎత్తి 1,83,762 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి కొనసాగుతోందని.. ఇందుకుగాను ప్రాజెక్టు నుంచి 24,785 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు వివరించారు. 45 క్యూసెక్కులు ఆవిరి అవుతుండగా.. ఎడమ కాల్వకు 290, కుడి కాల్వకు185, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.029 టీఎంసీలు ఉందన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం 5 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు వివరించారు. ఎగువలో 5 యూనిట్ల నుంచి 195 మెగావాట్లు, 130.116 ఎంయూ, దిగువలో ఇప్పటి వరకు 99.710 ఎంయూ విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 228.909 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని తెలిపారు.

సుంకేసులలో 3 గేట్ల నుంచి..

రాజోళి: సుంకేసులలో మంగళవారం మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 11,321 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 10,326 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్‌కు 995 క్యూసెక్కుల నీటిని వదిలామన్నారు.

రామన్‌పాడు నుంచి 10 వేల క్యూసెక్కుల నీరు విడుదల

మదనాపురం: మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయానికి మంగళవారం వరద ఉధృతి తగ్గింది. కోయిల్ సాగర్, మన్నెవాగు, ఊకచెట్టు వాగు వరద, సరళాసాగర్, శంకర సముద్రం, ద్వారా వరద జలాశయానికి చేరుతోంది. దీంతో నాలుగు గేట్లు ఎత్తి 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో, 10 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.


రామన్‌పాడు వద్ద నీటి విడుదల



సరళాసాగర్ నుంచి 7 వేల క్యూసెక్కులు

మదనాపురం: మదనాపురం మండలంలోని సరళాసాగర్ జలాశయం నుంచి 7 వేల క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. రెండు రోజుల పాటు ఉధృతంగా ఉన్న వరద మంగళవారం తగ్గుముఖం పట్టింది. మూడు వుడ్ సైఫాన్లు నిరంతరంగా నడుస్తున్నాయి. ఒక్కొక్క సైఫాన్ 2,300 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నాయి. మదనాపురం వాగు పారడంతో కొత్తకోట, మదనాపురం, ఆత్మకూరు, అమరచింత మండలాలకు రాకపోకలు నిలిపోయాయి.



కోయిల్‌సాగర్‌లో 4 గేట్లు..

దేవరకద్ర: మంగళవారం కోయిల్‌సాగర్ జలాశయం 4 గేట్లను ఒక అడుగు మేర పైకెత్తి నీరు విడుదల చేశారు. పెద్దవాగు నుంచి వచ్చే వరద తగ్గడంతో 3 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. మూడురోజులుగా ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 32 అడుగుల మేర ఉన్నట్లు అధికారులు వివరించారు.

ప్రమాదకరంగా కేఎల్ఐ కాల్వలు


కాల్వకు గండిపడి కోతకు గురవుతున్న రైతుల పొలాలు

- పలుచోట్ల గండ్లు.. నీట మునిగిన పంటలు

కల్వకుర్తి రూరల్: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు కల్వకుర్తి ప్రాంతంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాల్వలకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. ప్యాకేజీ 29 ప్రధాన కాల్వకు మండలంలోని తోటపల్లి, వెంకటాపూర్, జీడిపల్లి వద్ద గండ్లు పడ్డాయి. అలాగే వెంకటాపూర్‌లో మాచినేని చెరువు నిండి అలుగు పారింది. కుర్మిద్దలో కాల్వ తెగి వరి, పత్తి పంటలు నీట మునిగాయి. కేఎల్ఐ కాల్వలకు లైనింగ్ లేకపోవడంతో భారీ వర్షాలు కురిసినప్పుడల్లా గండ్లు పడుతున్నాయి. గతేడాది డిసెంబర్ నుంచి జూలై వరకు కాల్వలు ఒట్టిపోయి ఉన్నాయి. ఆ సమయంలో మరమ్మతులు చేసి ఉంటే గండ్లు పడే అవకాశం తక్కువగా ఉండేది. కాల్వల మరమ్మతులు చేపట్టి రైతులకు పంట నష్ట పరిహారం ఇప్పించాలని జీడిపల్లి, వెంకటాపూర్, కుర్మిద్ద రైతులు కోరుతున్నారు.


తోటపల్లిలో వర్షపు నీటితో నిండిన వరి పంట

నిర్లక్ష్యంతోనే నీట మునిగిన పంప్‌హౌస్ మోటార్లు

- అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల అధికారులు, మెఘా ఏజెన్సీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్లక్ష్యం వల్ల కుమ్మెర వద్ద నిర్మిస్తున్న వెంకటాద్రి రిజర్వాయర్‌లోని పంప్‌హౌస్, మోటర్లు నీట మునిగాయని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో ద్వారా ఆయన మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 7 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో ఏర్పాటు అవుతున్న ఈ ఎత్తిపోతల పథకంలో నాలుగవ పంప్ హౌస్‌లలో వట్టెం వెంకటాద్రి రిజర్వాయర్ 3వ రిజర్వాయర్ అని గుర్తు చేశారు. వెంకటాద్రి రిజర్వాయర్‌లో రూ.2437 కోట్లతో కొనుగోలు చేసిన మోటర్లు చెరువులు, కుంటల ద్వారా, కేఎల్ఐ కెనాల్ ద్వారా వచ్చిన వరద నీటితో నీట మునిగాయని విమర్శించారు. ప్రారంభానికి ముందే ఈ దుస్థితి నెలకొనడం దారుణమన్నారు. నీట మునిగిన మోటార్ల సామర్థ్యం తగ్గుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే వాటిపై స్పందించి ఏజెన్సీపై, అధికారులపై చర్యలు తీసుకొని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని పలు లాడ్జిలను మంగళవారం తెల్లవారుజామున పట్టణ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు పలు దుకాణాల్లో చోరీలకు పాల్పడారు. చోరీలు చేసి లాడ్జిలలో బస చేస్తున్నట్లు సమాచారం మేరకు ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 11 మంది అనుమానాస్పందగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్ 100 లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.


లాడ్జిలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

వంగూరు: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన వంగూరు మండలం కోనేటిపూర్ స్టేజీ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. శ్రీశైలం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కారు రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వారు హైదరాబాద్‌కు చెందిన వారని ఎస్ఐ తెలిపారు. గాయపడ్డ వారిని 108లో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడ్డ వారిలో మల్లారెడ్డి అనే వ్యక్తితో పాటు మరో ముగ్గురు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


క్షతగాత్రులు ఇలా..

రైతుల పొలాల్లోకి పరిశ్రమ వ్యర్థాలు

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న హిందుస్థాన్ ఫుడ్ లిమిటెడ్ పరిశ్రమ నుంచి రైతుల పొలాల్లోకి కాలుష్య నీటిని వదలడంతో స్థానిక రైతులు, మండల నాయకులు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. కాలుష్యం వదులుతున్న పరిశ్రమపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సురేష్‌కు ఎమ్మెల్యే సూచించారు. మంగళవారం అధికారులు వచ్చి రైతుల పొలాల్లోకి వచ్చిన నురుగ శ్యాంపిల్స్ సేకరించారు.



బ్లాక్ మెయిల్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రానికి చెందిన ఓ మహిళను ఉద్యోగం పేరుతో నమ్మించి అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని తెలుగుపేటకు చెందిన తెలుగు రాజు ఓ వివాహితతో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తరచుగా ఫోన్‌లో ఉద్యోగ విషయమై ఇద్దరు మాట్లాడుకునేవారు. ఈ క్రమంలోనే తెలుగు రాజు సదరు మహిళను లోబరుచుకున్నారు. అలాగే ఉద్యోగ అంశం మాట్లాడిన ప్రతిసారి దాటవేస్తూ కాలయాపన చేశాడు. ఇరువురి విషయం మహిళ కుటుంబ సభ్యులకు తెలియడంతో ఆమెను నిలదీయడంతో అసలు విషయం చెప్పింది. దీంతో బాధిత మహిళ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తెలుగు రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


పేకాట రాయుళ్ల అరెస్టు

గద్వాల క్రైం: గుట్టుగా పేకాట ఆడుతున్న స్థావరంపై రూరల్ పోలీసులు దాడులు చేసి రూ.32వేల నగదును స్వాధీనం చేసుకుని, 11 మందిపై కేసు నమోదు చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. గద్వాల మండల పరిధిలోని అనంతపురం గుట్టల ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు మంగళవారం సాయంత్రం దాడులు చేపట్టారు. దాడిలో వినోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. చరణ్, తిమ్మప్ప, గోవర్ధన్, నరసింహ, జాని, ప్రభాకర్, తిమ్మన్న, పరుష, సుధాకర్, అంజనేయులు తప్పించుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి ఒక మొబైల్ ఫోన్, స్కూటీ, పేకాముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తప్పించుకున్న వారిని సైతం అదుపులోకి తీసుకుంటామన్నారు. వారిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ కథనం మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లి సమీపంలోని రైలు పట్టాలపై మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి(30) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైలు వేగంగా రావడం వల్ల ముఖం, శరీర భాగాలు పూర్తిగా గుర్తించలేని విధంగా మారాయి. మృతుడి ఒంటిపై దుస్తులు లేకపోవడంతో పాటు ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన వాళ్లు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

జంతువుల దాడిలో ఆవుదూడలు మృతి



నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): తిమ్మాజీపేట మండలంలోని చేగుంటలో గుర్తు తెలియని జంతువులు దాడి చేయడంతో రెండు ఆవుదూడలు మృతిచెందినట్లు బాధిత రైతు ఉపేందర్‌రెడ్డి తెలియజేశారు. సోమవారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద కొట్టంలో పశువులను కట్టేశాడు. మంగళవారం కొట్టంలోకి వెళ్లి చూడగా రెండు ఆవుదూడలను గుర్తుతెలియని జంతువులు చంపి తిన్నాయి. పశు వైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు ఎనిమల్ టాకర్, ఎల్లయ్య, హనుమంతు, ఏఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలిని పరిశీలించారు. నష్టపోయిన రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని, క్రూర జంతువులను అదుపు చేసి తమకు, పశువులకు రక్షణ కల్పించాలని చేగుంట మాజీ ఎంపీటీసీ మల్లయ్య, రైతులు చెన్నయ్య, బీంరెడ్డిలు అధికారులను కోరారు.